ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేయాలి

అదనపు కలెక్టర్ నగేశ్

నందిగామలోని దుర్గ రైస్‌మిల్లును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

నిజాంపేట, నవంబర్ 16: కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం లోడ్‌తో వచ్చిన లారీలను వెంటనే అన్‌లోడ్ చేయాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్ రైస్‌మిల్లు యజమానులకు సూచించారు. శనివారం మండలంలోని నందిగామ శ్రీదుర్గా రైస్ మిల్లును అదనపు కలెక్టర్ సందర్శించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకుండా మిల్లు యజమానులు నడుచుకోవాలన్నారు. ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, సిబ్బంది రాజలింగం, రైతులు ఉన్నారు.

డి.ధర్మారంలో రైస్‌మిల్లు యజమానులకు సూచనలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

రామాయంపేట, నవంబర్ 16: రైస్‌మిల్లు యజమానులు ధాన్యం నిల్వ ఉంచి రైతులను ఇబ్బందులు పెట్టవద్దని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రామాయంపేట మండలంలోని డి.ధర్మారంలో వెంకటేశ్వర, నార్సింగి మండలకేంద్రంలోని హనుమాన్ రైస్‌మిల్‌ను సందర్శించి మిల్లులో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను పరిశీలించి, మిల్లు యజమానులతో మాట్లాడారు. యజమానులు ధాన్యం నిల్వలు ఉంచడంతోనే రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రైస్‌మిల్లు యజమానులు మిల్‌కు ధాన్యం రావడంతోనే వెంటనే లారీని ఖాళీ చేయించి వెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. కల్లాల వద్ద ధాన్యం ఉండడంతో రైతుల పరిస్థితి అధ్వానంగా తయారవుతుందని, మిల్లు యజమానులు రైతులకు సహకరించాలని సూచించారు. ఎస్పీ వెంట రామాయంపేట సీఐ వెంకటరాజ గౌడ్ ఉన్నారు.

సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సత్యసాయి సేవా సంస్థ బాధ్యులు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 16: భగవాన్ సత్యసాయి 99వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని సత్యసాయి యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయుష్మాన్ రక్తనిధి సౌజన్యంతో సత్యసాయి మందిరంలో రక్తదాన శిబిరం నిర్వహించి 27 యూనిట్లు సేకరించినట్లు సత్యసాయి సేవాసంస్థ జిల్లా అధ్యక్షుడు శిరగ ప్రభాకర్ తెలిపారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయిబాబా, శంకర్ గౌడ్, శేఖర్, రామకృష్ణ, యాదవరెడ్డి, మణికంఠ రుక్మిణీ, లక్ష్మి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

విద్యుత్ చోరీ చేస్తున్న 15 మందిపై కేసు నమోదు

వెల్దుర్తి, నవంబర్ 16:విద్యుత్ విజిలెన్స్ అధికారులు శనివారం వెల్దుర్తితోపాటు పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. విద్యుత్ చోరీ చేస్తున్న 15 మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. తూప్రాన్ విద్యుత్ శాఖ డీఈ గరట్ మంతరాజు ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని అధికారులు 11 బృందాలుగా ఏర్పడి నివాస గృహాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో తనిఖీలు చేపట్టారు. మీటర్లు లేకుండా, విద్యుత్ చోరీ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ..విద్యుత్ చోరీ చేయవద్దని, ప్రతి ఇంటికీ మీటర్ ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ అందిస్తున్న విద్యుత్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంటల రక్షణకు రైతులు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ కంచెతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, రైతులతోపాటు పశువులు మృతి చెందుతున్నాయన్నారు. విద్యుత్ కంచె ఏర్పాటు చేసే రైతులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్దశంకరంపేట, నవంబర్ 16:రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దశంకరంపేట మండలం శివయపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ కథనం ప్రకారం..శుక్రవారం అర్ధరాత్రి మూసాపేట గ్రామానికి చెందిన రైతు కుర్మగొల్ల బీరప్ప(40) మిల్లులో ధాన్యం విక్రయించడానికి స్నేహితుడు దేవయ్యతో కలిసి ట్రాక్టర్‌లో వెళ్లాడని చెప్పారు. ఇద్దరూ మద్యం తాగి ట్రాక్టర్ నడపడంతో బీరప్ప ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తన్నామన్నారు.

పద్మశాలి సంఘం సంయుక్త కార్యదర్శిగా సత్యనారాయణ



సత్యనారాయణకు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్

రామాయంపేట, నవంబర్ 16: పద్మశాలి సంఘం సంయుక్త కార్యదర్శిగా రామాయంపేట పట్టణానికి చెందిన మద్దెల సత్యనారాయణను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ మేరకు శనివారం గజ్వేల్ పద్మశాలి సంఘం కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. అనంతరం రామాయంపేటలో సత్యనారాయణ మాట్లాడుతూ..సంఘం పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. తనకు సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలను అప్పగించిన అధ్యక్షుడు రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మ్యాకల జయరాములు, మండల అధ్యక్షుడు రమేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

టీపీటీఎఫ్ అధ్యక్షుడిగా యాదగిరి

యాదగిరి, వెంకట్రామిరెడ్డి
జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 16: టీపీటీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కొంగోటి యాదగిరి, వెంకట్రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో జరిగిన సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, గోపాల్, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, విఠల్ రెడ్డి, ప్రభాకర్, లక్ష్మణ్, కార్యదర్శులుగా సాయిబాబా, పద్మ, నసీరుద్దీన్, రాజయ్య, సురేందర్, దేవీసింగ్, శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా మొయిజుద్దీన్, సునీత, సంజీవయ్య రాష్ట్ర కౌన్సిలర్లుగా సంగయ్య, హీరాలాల్, రాజేంద్రప్రసాద్, సంగీత, రాజేంద్రప్రసాద్, నజీరుద్దీన్, రమేశ్, రజిత నియమితులయ్యారు. వీరితో పాటు పలు కమిటీల కన్వీనర్లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు.

ధాన్యం కొనుగోలులో సర్కార్ విఫలం

నిజాంపేట, నవంబర్ 16: ధాన్యం కొనుగోలులో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట వంజరి సంఘం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. రైతులకు బోనస్ ఇస్తామని బోగస్ మాటలు చెప్పి ధాన్యం కొనకుండా రైతులను మోసం చేస్తున్నదన్నారు. రైతులు ఎప్పుటికప్పుడు కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు చంద్రం, బాపురెడ్డి, డైరెక్టర్లు స్వామిగౌడ్, అబ్దుల్‌ఆజీజ్, తిరుమల ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్, ఏఎంసీ డైరెక్టర్ రవి, బండారి తిరుమల్, ధర్మారెడ్డి, ముస్తఫా, సంపత్ తదితరులు ఉన్నారు.



నిజాంపేటలో బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

యాభై శాతం సర్వే పూర్తి

కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తిలో సమగ్ర కుటుంబ సర్వేలో వివరాల నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి, నవంబర్ 16. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే జిల్లాలో యాభైశాతం పూర్తయిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం వెల్దుర్తిలోని అంగడిపేటవాడలో జరుగుతున్న సర్వేలో పాల్గొన్న కలెక్టర్ సర్వే వివరాల నమోదు పరిశీలించి, ప్రజలకు అవగాహన కల్పించారు. సర్వే చేస్తున్న తీరు, వివరాల నమోదు, ప్రజల స్పందనను ఎన్యూమరేటర్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 2.20 లక్షల నివాస గృహాలు ఉండగా, శనివారం నాటికి యాభైశాతం పూర్తి చేసుకున్నామన్నారు. సర్వే వివరాల పత్రాలను స్ట్రాంగ్ రూంలో పకడ్బందీగా భద్రపర్చనున్నామని చెప్పారు. రేషన్‌కార్డుకు సర్వేకు ఎలాంటి సంబంధం లేదని, ఇల్లు లేని వారు, రేషన్ కార్డు లేని వారు, ఉమ్మడి కుటుంబ సభ్యులు ఒకే దగ్గర సర్వే వివరాలు ఇవ్వవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అద్దెకు ఉంటున్న వారు కూడా వివరాలు ఇవ్వవచ్చునని, వారి స్వగ్రామాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో సమస్యలు లేకుండా సర్వే జరుగుతుందని, సర్వేకు సహకరిస్తున్న ప్రజలకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

చాకరిమెట్లలో భక్తుల సందడి

శివ్వంపేట, నవంబర్ 16: శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల పంచాయతీ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తికమాసం శనివారం కావడంతో భక్తులు ఉదయం నుంచే చందనాభిషేకం, సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఈవో ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, పూజారులు దేవదత్తు శర్మ, దేవీశర్మ, ప్రభురాజ శర్మ, శ్రీవాత్సవ శర్మ, సిబ్బంది ఉన్నారు.

చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

గ్రూప్-3 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 16: జిల్లాలో గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు చేసినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, అబ్జర్వర్లు, ఐడెంటిఫికేషన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, రూట్ ఆఫీసర్ల శిక్షణ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈనెల 17, 18 తేదీల్లో జరిగే పరీక్షలను సమన్వయంతో ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని 29 పరీక్షా కేంద్రాలకు 16 లోకేషన్లు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. మెదక్ సబ్ డివిజన్‌లో 12 పరీక్షా కేంద్రాలు, తూప్రాన్ సబ్ డివిజన్‌లో 7 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. టీపీఎస్‌సీ నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామని, అభ్యర్థులు బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలన్నారు. అభ్యర్థులు సెల్‌ఫోన్, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లారాదన్నారు. ప్రతి కేంద్రం ఎదుట సెంటర్ పేరు, సెంటర్ కోడ్ తెలిపే విధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, మెడికల్ కిట్‌తోపాటు వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని, పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ అధికారి నాగరాజుగౌడ్‌తోపాటు సంబంధింత అధికారులు పాల్గొన్నారు.

రామాయంపేట ప్రభుత్వ కళాశాలలో
నెంబర్లు వేస్తున్న ఇన్విజిలెటర్లు

గ్రూప్ -3కి సర్వం సిద్ధం

రామాయంపేట, నవంబర్ 16: గ్రూప్ త్రీ పరీక్షకు సర్వం సిద్ధం చేశారు. శనివారం రామాయంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మల్లేశం ఇన్విజిలెటర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సూచనలు సలహాలిచ్చారు. పరీక్షలు రాసే అభ్యర్థులు తప్పని సరిగా ఒరిజినల్ గుర్తింపు కార్డు, హాల్ టికెట్‌తో పరీక్షా హాల్లోకి రావాలన్నారు. పరీక్షకు అరగంట ముందే అభ్యర్థులు చేరుకోవాలని తెలిపారు. తప్పుడు గుర్తింపు కార్డులతో వస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం పరీక్ష హాల్లో స్టిక్కర్లు అతికించి, నెంబర్లు వేశారు. పరీక్షలు మూడు రోజులపాటు ఉదయం, మధ్యాహ్నం జరుగుతాయని తెలిపారు. గ్రూప్ త్రీ పరీక్ష 222 మంది రాస్తున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ విలేకరులతో తెలిపారు. పరీక్షలు అయ్యే వరకు కళాశాల చుట్టూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే వారి కోసం కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పటిష్టమైన బందోబస్తు

మెదక్ అర్బన్, నవంబర్ 16: ఈనెల 17,18 తేదీల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్ 3 పరీక్షకు పోలీస్‌శాఖ తరపున అన్ని రకాల భద్రతాపరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలు నామినేట్ చేయబడ్డాయని, మొత్తం 5,867 మంది హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు, భద్రత కోసం144 సెక్షన్ అమలులో ఉందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్, ఇతర దుకాణాలు మూసి ఉంచాలని, ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 200మంది పోలీస్ అధికారులతో భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.

సమగ్ర కులగణనపై చైతన్య సదస్సు

రామాయంపేట, నవంబర్ 16: సమగ్ర కులగణనపై ఈనెల 19న మెదక్‌లో ఉమ్మడి జిల్లా సమావేశం ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం పేర్కొన్నారు. శనివారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రంలో కుల గణనను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందుకోసం గ్రామాలు, మండల కేంద్రాల్లో ఉన్న బీసీ కులస్తుసందరూ కచ్చితంగా కులగణనలో పాల్గొని వివరాలు తెలియజేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా సమావేశానికి ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరవుతారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీలందరూ పార్టీలకతీతంగా సమావేశానికి తరలిరావాలన్నారు.

పుస్తెమెట్టెలు పంపిణీ

కౌడిపల్లి, నవంబర్ 16: మండలంలోని వెల్మకన్న గ్రామానికి చెందిన గొల్ల లలితాభూమయ్య దంపతుల కూతురు అనూష వివాహానికి శనివారం బీజేపీ కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి పుస్తెమెట్టెలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ సహకారంతో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజీపేట రాజేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు రాకేశ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌తోపాటు పలువురు నాయకులతో కలిసి నూతన వధువుకు అందజేసి ఆశీర్వదించారు.

ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తాం

- నిబంధనల ప్రకారం రైతులు ధాన్యం తేవాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- వెల్దుర్తిలో కొనుగోలు కేంద్రం, రైస్‌మిల్లు పరిశీలన

వెల్దుర్తి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో
రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి, నవంబర్ 16: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం వెల్దుర్తిలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం, రాఘవేంద్ర రైస్‌మిల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమశాతం, ధాన్యం నాణ్యతను కలెక్టర్ పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేయవద్దని, అలాచేస్తే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యాన్ని వేగంగా రైస్ మిల్లులకు తరలించాలని, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇప్పటివరకు 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, వారం రోజుల నుంచి కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయని, ప్రభుత్వ ఆదేశాల మేరకు రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ ఇవ్వడానికి మందుకు రాకపోవడంతో రైస్ మిల్లర్లతో మాట్లాడి 73 రైస్‌మిల్లులు కేటాయించి, ధాన్యాన్ని వేగంగా తరలిస్తున్నామన్నారు. రైతులకు ఇబ్బంది కలిగేలా ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఆ రైస్‌మిల్లులను సీజ్ చేస్తామన్నారు. సన్న వడ్లు విషయంలో రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ఏ ధాన్యం అయిన తాలు లేకుండా రైతులు చూడాలన్నారు. ప్రత్యేక మిషన్ల ద్వారా సన్న వడ్లను పరిశీలించి, వాటిని కొనుగోలు చేస్తామన్నారు. సన్న వడ్ల కొనుగోలు కోసం జిల్లా వ్యాప్తంగా 90 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

మిల్లులకు వచ్చే ధాన్యాన్ని ఖాళీ చేయాలి

విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు

ఎల్లాపూర్‌లో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న
విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు

పాపన్నపేట, నవంబర్ 16: రైస్‌మిల్లులకు వచ్చే ధాన్యం లారీలను వెంటనే ఖాళీ చేయాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుటామని విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన మండల పరిధిలోని ఎల్లాపూర్ రైస్‌మిల్లును ఆస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దింపుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. రైస్‌మిల్లుకు వచ్చిన లారీలను ఖాళీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం వాహనాలను రోడ్లపై నిలిపి ప్రమాదాలకు కారణమైతే సహించబోమన్నారు. ఆయన వెంట ఎస్ఐ సాంబశివరావు, తహసీల్దార్ ప్రభాకర్, డీటీ ప్రణతి తదితరులు ఉన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి డిప్లొమా ఇన్ ల్యాబ్ టెక్నీషియన్, డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నీషియన్ కోర్సుల ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ శనివారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 20న చివరి తేదీ అని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ వైద్య కళాశాల మెదక్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 16:విదేశాల్లో ఉన్నత చదువుల కోసం అర్హులైన మైనార్టీ అభ్యర్థులు(ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధ, పార్సీ) ఈనెల 18 నుంచి 30 వరకు ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ, టీవోఈఎఫ్‌ఎల్ పరీక్షలకు మైనార్టీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమశాఖ అధికారి జెమ్లానాయక్ శనివారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు విద్యకు సంబంధించి జిరాక్స్ పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డులతో హైదరాబాద్ అబిడ్స్‌లోని మైనార్టీస్ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సామాజిక సర్వే తనిఖీ

అప్పాజీ పల్లిలో సర్వే ఫారాన్ని
పరిశీలిస్తున్న జడ్పీసీఈవో ఎల్లయ్య

కొల్చారం, నవంబర్ 16: మండల పరిధిలోఎని అప్పాజీపల్లిలో కొనసాగుతున్న సామాజిక సర్వేను శనివారం జడ్పీసీఈవో ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న సామాజిక సర్వే తీరును పరిశీలించారు. సర్వే ఫారాన్ని పరిశీలించి ఎన్యూమరేటర్లకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణవేణి ఉన్నారు.

బిర్సాముండా జయంతి

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 16: ఆదివాసీల హక్కుల కోసం పోరాడి అమరుడైన వీరుడు భగవాన్ బిర్సాముండా జయంతిని శనివారం మెదక్‌లోని మహిళా గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శరత్‌దీపిక బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

విద్యార్థిని మృతికి సంతాపం

నిజాంపేట, నవంబర్ 16: నిజాంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ల్యాగల సాయిప్రియ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఈనెల 14న మృతి చెందింది. శనివారం నిజాంపేట మండలంలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల యాజమాన్యాలు సెలవు ప్రకటించాయి. తోటి విద్యార్థిని మృతి పట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ముదిరాజ్ బేడ వన్ అధ్యక్షుడు
దేవుని రవిని సన్మానిస్తున్న బాధ్యులు

ఏకగ్రీవంగా ముదిరాజ్ బేడవన్ ఎన్నికలు

రామాయంపేట, నవంబర్ 16: రామాయంపేట ముదిరాజ్ సంఘం బేడవన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. శనివారం పట్టణంలోని దుర్గమ్మ ఆలయంలో జరిగిన ఎన్నికల్లో బేడ వన్ అధ్యక్షుడిగా దేవుని రవిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా చల్మెడ శ్రీనివాస్, రైటర్లుగా పెంటమీది శ్రీనివాస్, దేవుని పవన్, కార్యవర్గ సభ్యులుగా దాకి శ్రీనివాస్, గంగేరి పోచయ్యలను ఎంపిక చేశారు. అనంతరం దుర్గమ్మ దేవాలయంలో కమిటీ సభ్యులందరినీ శాలువాతో ఘనంగా సన్మానించారు.